
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 18 జూన్ 2025

6 లేన్లుగా మెరీనా బీచ్ రోడ్డు



● ట్రాఫిక్ నియంత్రణకు కార్పొరేషన్ చర్యలు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు మెరీనా బీచ్ రోడ్డును ఆరు లేన్ల రహదారిగా మార్చాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. దేశంలోనే పొడవైన బీచ్‌గా మెరీనా తీరానికి పేరుంది. ఈ బీచ్‌కు స్థానికులతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. నిత్యం పర్యాటకులతో కళకళలాడుతున్న మెరీనా బీచ్‌లో ట్రాఫిక్ సమస్య కూడా అధికంగా ఉంది. కామరాజ్ రోడ్డులో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ ఏర్పడి చాలా సేపు వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం మెరీనా లైట్ హైస్ సమీపంలో జరుగుతున్న మెట్రోరైలు పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు, పర్యాటకుల విజ్ఞప్తి మేరకు, ప్రస్తుతం నాలుగు లేన్ల రహదారిగా ఉన్న మెరీనా బీచ్ రోడ్డును ఆరు లేన్లగా మార్చేందుకు జీసీసీ నిర్ణయించింది. అందుకోసం కామరాజర్ రోడ్డులోని వార్ మెమోరియల్ నుంచి లైట్ హౌస్ వరకు 2.8 కి.మీ విస్తరించనున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు 23 మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ రోడ్డును అదనంగా 6 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్లగా మార్చాలని నిర్ణయించారు. ప్రస్తుతం విస్తరంచనున్న ప్రాంతంలో నడక దారి, దివంగత నేతల విగ్రహాలున్నాయి. రోడ్డు విస్తరణ కోసం వార్ మెమోరియల్ నుంచి లైట్ హౌస్ వరకు ఉన్న 9 విగ్రహాలు ఇతర ప్రాంతాలకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే, 20 మీటర్ల వెడల్పు కలిగిన రాధాకృష్ణన్ రోడ్డు కూడా విస్తరించనున్నారు.ఈ విస్తరణపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు జీసీసీ అధికారులు తెలిపారు.


చెన్నై నుంగంబాక్కంలో రూ.80 కోట్లతో పునరుద్ధరించిన వల్లువర్‌కోట్టంలో విద్యుద్దీప కాంతులీనుతున్న రథం

● బాలుడి కిడ్నాప్ వ్యవహారం...

అదనపు డీజీపీ జయరామన్ సస్పెన్షన్



● అరెస్టుపై సుప్రీంకోర్టులో అప్పీలు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు సమీపంలో 17 యేళ్ల బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో హైకోర్టు ఆదేశాల మేరకు అరెస్టయిన అదనపు డీజీపీ జయరామన్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు అరెస్టు ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ జయరామన్ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్లారు. బాలుడి కిడ్నాప్ సంఘటనకు తనకు ఎలాంటి సంబంధం లేదని, యూనిఫాంలో ఉండగానే తనను అరెస్టు చేసి, పోలీసుశాఖకు సుదీర్ఘకాలంగా తానందించిన సేవలను కాదని, తన సర్వీసుపై కళంకం ఆపాదించారని అప్పీలు పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖలో బాధ్యతాయుతమైన ఉన్నతోద్యోగిగా ఉన్న తనను అరెస్టు చేయడం వల్ల తన భవిష్యత్‌కు భంగం ఏర్పడుతుందని, ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని తన అప్పీలును అత్యవసర కేసుగా భావించి త్వరగా విచారణ జరపాలని కోరారు. ఈ వాదన పరిశీలించిన సుప్రీంకోర్టు ఈ అప్పీలుపై బుధవారం విచారణ జరిపేందుకు అంగీకరించింది. ఇదిలా ఉండగా ఏడీజీపీ జయరామన్ వచ్చే యేడాది మే నెలలో పదవీ విరమణ చేయనున్నారని, ఆలోగా కిడ్నాప్ కేసులో ఆయన అరెస్టు కావటం పోలీసు వర్గాలలో తీవ్ర కలకలం రేపింది.

ఎమ్మెల్యే పూవై జగన్‌మూర్తిపై కేసు నమోదు



● తిరువలంగాడు స్టేషన్‌లో విచారణ

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు కేవీ కుప్పం పురట్చిభారతం శాసనసభ్యుడు పూవై జగన్‌మూర్తి మంగళవారం ఉదయం తిరువలంగాడు పోలీసుస్టేషన్‌లో హాజరై సంతకం చేశారు. కిడ్నాప్ సంఘటనకు సంబంధించి ఆయనపై పోలీసులు మూడు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసుస్టేషన్‌లో హాజరైన జగన్‌మూర్తిని డీఎస్పీ తమిళరసి నాయకత్వంలోని పోలీసులు అధికారులు విచారణ జరిపారు. ఈ కిడ్నాప్ కేసులో ఇప్పటికే మహిళా ఎస్‌ఐ మహేశ్వరి, న్యాయవాది శరత్‌కుమార్, తిరువళ్లూరు యువకుడిని ప్రేమ వివాహం చేసుకున్న యువతి తండ్రి వనరాజా, మణికంఠన్, గణేశన్ సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఎస్సై మహేశ్వరి ఇచ్చిన వాంగ్మూలంలో కిడ్నాప్ వ్యవహారంపై తాను ఏడీజీపీ జయరామన్‌తో ఫోన్‌లో పలుమార్లు మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే జగన్‌మూర్తి వద్ద పోలీసులు విచారణ జరుపుతూ ఏడీజీపీ జయరామన్ కిడ్నాప్ కోసం ఎలాంటి సహాయం చేశారో చెప్పాలనానరు. తేని జిల్లాలో ఉన్న యువతి తండ్రితోపాటు ఇంకా ఎవరెవరు పరిచయం అయ్యారో వివరాలను వెల్లడించాలని పోలీసు అధికారులు ప్రశ్నించారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం జగన్‌మూర్తి మందీ మార్బలం వెంటతీసుకెళ్లకుండా తానొక్కడే కారులో వెళ్లి తిరువలంగాడు పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

స్టాలిన్‌తో పరమక్కుడి, పరమత్తివేలూరు ఇన్‌ఛార్జుల భేటీ


పరమక్కుడి ఇన్‌ఛార్జితో చర్చిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలలో డీఎంకే కూటమి 200 సీట్లు గెలుచుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై దృష్టిసారించిన ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'ఉడన్ పిర ప్పేవా' పేరుతో జిల్లా ఇన్‌ఛార్జులతో ముఖాముఖీ సమావేశాలు జరుపుతున్నారు. ఈ నెల 13న చిదంబరం, విల్లుపురం, ఉసిలంపట్టి శాసనసభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జులతో ఆయన చర్చించారు. మంగళవారం ఉదయం పరమక్కుడి, గౌండంపాళయం, పరమత్తివేలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. ఆ మూడు నియోజకవర్గాల్లో డీఎంకే అభ్యర్థులు పోటీ చేయాలా? లేక మిత్ర పక్షాలకు కేటాయించాలా? అంటూ స్టాలిన్ వారిని ప్రశ్నించారు. మూడు నియోజకవర్గాల్లోనూ డీఎంకే విజయం కోసం పాటుపడే అంగబలం, ఆర్థికబలం కలిగిన పార్టీ నాయకులున్నారని, ఆ మూడు సీట్లలో పార్టీ అభ్యర్థులు పోటీచేస్తేనే మంచిదని ఇన్‌ఛార్జులు స్టాలిన్‌కు సూచించారు. ఇక నియోజకవర్గాల్లో స్థానిక నాయకుల మధ్య సఖ్యత ఉందా లేదా అని కూడా స్టాలిన్ ప్రశ్నించారు.

మదురై ఎయిమ్స్‌పై..

వీడియోకే పదేళ్లు.. నిర్మాణానికి ?

● సీఎం స్టాలిన్ విమర్శ

మదురైలో కేంద్ర ప్రభుత్వం నిర్మించనున్న ఎయిమ్స్ ఆస్పత్రి ఏ తరహాలో ఉంటుందో, ఎన్ని భవనాలుంటాయో తెలిపే ఓ వీడియో మంగళవారం విడుదలైంది.ఈ వీడియోలో మదురై ఎయిమ్స్ భవనంపై హెలికాప్టర్ అంబులెన్స్‌లు దిగుతున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. ఆ వీడియోను చూసిన ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ మదురై సమీపం తోప్పూరులో 222 ఎకరాల్లో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి 2018లో కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, 2019లో ప్రధాని నరేంద్రమోదీ అట్టహాసంగా శంకుస్థాపన చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణ పనులు జరుగలేదని ఆరోపించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరించారు. కేంద్రం విడుదల చేసిన వీడియోలో మదురై ఎయిమ్స్ ఆస్పత్రి తొలి విడత నిర్మాణ పనులు 2026 జనవరిలో పూర్తవుతాయని, రెండో విడత పనులు 2027లో పూర్తవుతాయని పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎయిమ్స్ ఆసుపత్రికి శంకుస్థాపన జరిగిన తర్వాత ఆ ఆస్పత్రి ఎలా ఉంటుందన్న నమూనా వీడియో రూపొందించి విడుదల చేయడానికే కేంద్ర ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని, ఈ వీడియోను వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బీజేపీ, దాని మిత్రపక్షాలు ఉపయోగించి ఓటర్లను మభ్యపెట్టడం ఖాయమని స్టాలిన్ పేర్కొన్నారు.

నీలగిరిలో కుండపోత

● కూలిన చెట్లు, పడిన మట్టి పెళ్లలు
● ప్రజలకు ఇబ్బందులు


గూడలూరు రోడ్డులో కోతకు గురైన రహదారి

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో గత కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. రహదారులపై చెట్లు కూలిపడ్డాయి. ఘాట్‌రోడ్డులో మట్టిపెళ్ళలు విరిగిపడ్డాయి. పెనుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. గత ఐదు రోజులుగా జాతీయ విపత్తుల నిర్వహణ బృందం, రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం జిల్లా అంతటా సహాయక చర్యలను ముమ్మరం చేశారు. వీరితోపాటు అగ్నిమాపక సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొని చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. ఊటీ - ఎమరాల్డ్ రహదారిలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కూలి విద్యుత్‌స్తంభంపై పడింది. ఈ కారణంగా మంజన్‌కొరై, ముత్తొరై పాలాడ్, ముళ్ళికూరై, కప్పతురై సహా 20 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శేరంబాడి - సుల్తాన్ పత్తేరి రోడ్డులో కప్పలా ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి రోడ్డు పక్కనే ఉన్న పనసచెట్టు విద్యుత్ స్తంభంపై కూలిపడింది. దీంతో వైరు తెగిపోయి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సేరంగోడు సమీపం చింకోనా ప్రాంతంలో రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూలింది. గూడలూరు వద్ద పాండియారు ప్రాంతం వద్ద టీ కార్మికులు నివాసాలు బాగా దెబ్బతిన్నాయి. గూడలూరు, పందలూరు ప్రాంతాల్లో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఇదే విధంగా జిల్లాల్లో పలుచోట్ల విధ్వంసాలు, చెట్లు కూలిపడటంతో పలు చోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షబాధితులు 1077 నెంబర్‌కు ఫోన్ చేసి తగు సహాయాలు పొందవచ్చునని అధికారులు తెలిపారు.


ఊటీ - ఎమరాల్డ్ మార్గంలో కూలిపడిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న కార్మికుడు

మురుగన్ భక్తుల మహానాడుకు యోగి, పవన్


'కమలాలయం'లో మురుగన్ భక్తుల మహానాడు సందర్భంగా రూపొందించిన పాటల సీడీ ఆవిష్కరిస్తున్న నయినార్ నాగేంద్రన్ తదితరులు

● బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న మదురైలో హిందూ మున్నాని, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న మురుగన్ భక్తుల మహానాడులో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. టి.నగర్‌లోని బీజేపీ కార్యాలయం 'కమలాలయం'లో మురుగన్ భక్తుల మహానాడును పురస్కరించుకుని రూపొందించిన భక్తిగీతాల సీడీని ఆయన ఆవిష్కరించారు. మదురై రింగ్‌రోడ్డు ప్రాంతంలో జరిగే ఈ మహానాడులో పాల్గొననున్న భక్తుల కోసం ఈ నెల 21న చెన్నై నుండి ప్రత్యేక రైలు నడుపునున్నారని, అదే విధంగా ఈ నెల22న చెన్నైకి తిరిగిరావటానికి ప్రత్యేక రైలు కూడా నడుపుతారని ఆయన చెప్పారు. ఈ మహానాడులో పాల్గొనేందుకు మలేసియా, సింగపూరు, కొలంబో నుండి కూడా భక్తులు రానున్నారని చెప్పారు. మురుగన్ భక్తుల మహానాడుకు రాజకీయ రంగు పులుమకూడదని, ఇది పూర్తిగా ఆధ్యాత్మికపరమైన మహానాడు మాత్రమేనని, డీఎంకేలోనూ ఎంతోమంది మురుగన్ భక్తులున్నారని, రాజకీయాలకు అతీతంగా వారంతా మహానాడుకు వస్తే తామంతా సంతోషిస్తామని చెప్పారు. మురుగప్పెరుమాన్‌కు చెందిన ఆరు దివ్యక్షేత్రాలు రాష్ట్రంలోనే ఉన్నాయని కనుక తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కొలువుదీరిన క్షేత్రానికి సమీపంలో ఉన్న మదురైని మహానాడుకు ఎంచుకున్నారని చెప్పారు. బీజేపీకి బలం తగ్గటం వల్లే మురుగన్ భక్తుల మహానాడు జరుపుతున్నారని డీఎంకే నేతల ఆరోపించడం గర్హనీయమన్నారు. ప్రస్తుతం బీజేపీ తమిళుల ఆరాధ్యదైవం మురుగన్‌ను చేతుల్లోకి తీసుకుందని, త్వరలో రాష్ట్ర పాలన కూడా తమ చేతుల్లోకి రావటం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కరాటే త్యాగరాజన్, నారాయణన్ తిరుపతి, బీజేపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షులు పి.రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉప రాష్ట్రపతి పర్యటన

పుదుచ్చేరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో మూడు రోజుల పర్యటన ముగించుకున్న ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ మంగళవారం మధ్యాహ్నం చెన్నై మీదుగా ఢిల్లీ బయలుదేరివెళ్ళారు. కాగా పుదుచ్చేరి పర్యనటకు వచ్చిన ఉప రాష్ట్రపతి జిప్మర్, పుదుచ్చేరి విశ్వవిద్యాలయాల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటిస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. ఈ నెల 15న అక్కడి రాజ్‌భవన్‌లో బసచేసిన ఉప రాష్ట్రపతిని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, స్పీకర్ సెల్వం, హోం మంతి ఎ.నమశ్శివాయం కలుసుకున్నారు. ఇదే విధంగా కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి, ఎంఈ వైద్యలింగం, ఎమ్మెల్యే వైద్యనాథన్ కూడా ఉపరాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిప్మర్ వర్శిటీలో 'దేశ నిర్మాణంలో పర్యావరణ స్థిరత్వం పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సోమవారం పుదుచ్చేరి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ హోదాలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఆ విశ్వవిద్యాలయంలో ప్రసంగించారు. మంగళవారం ఉదయం ఆయన పుదుచ్చేరి పర్యటన ముగించుకుని చెన్నై మీదుగా ఢిల్లీకి బయలుదేరారు. పుదుచ్చేరి నుండి హెలికాప్టర్‌లో మీనంబాక్కం విమానాశ్రయం చేరుకున్న ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఘనంగా వీడ్కోలు పలికారు.

చెన్నై విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్‌కు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి


● భూ కబ్జాకేసు ...

జూలై 24న మంత్రి సుబ్రమణ్యంపై ఛార్జిషీటు దాఖలు



ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములు దోచుకున్న కేసులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యంపై జూలై 24న ఛార్జిషీటు దాఖలు చేయాల్సిందిగా మద్రాస్ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి సుబ్రమణ్యం జీసీసీ మేయర్‌గా వ్యవహరించిన సమయంలో తనకున్న అధికారంతో గిండీలోని కార్మికుల కాలనీలో ఎస్‌కే కన్నన్‌కు కేటాయించిన సిట్కో స్థలాన్ని తన భార్య కాంచన పేరు మీద మార్పు చేసినట్లు పార్తీబన్ అనే వ్యక్తి 2011వ సంవత్సరం గిండీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు విచారణను ఏసీబీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విచారణ జరిపిన అవినీతి నిరోధకశాఖ 2019లో మంత్రి సుబ్రమణ్య ఆయన భార్య కాంచనలకు వ్యతిరేకంగా చార్జిషాటు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ కేసు ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసులపై విచారణ జరిగే ప్రత్యేక కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో, ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ మంత్రి సుబ్రమణ్యం దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చుతూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. కేసు విచారణను త్వరిత గతిన పూర్తిచేయాలని ప్రత్యేక కోర్టును ఆదేశించి జూలై 24న మంత్రి సుబ్రమణ్యంపై ఛార్జిషీటు దాఖలు చేయాలని సంబంధిత పోలీసులకు ఉత్తర్వులు జారీచేసింది.

కళ్లకురిచ్చి కల్తీసారా దుర్ఘటనకు
యేడాది పూర్తి
- 6లో -

సభ్యత్వ కార్డు ఉంటేనే
సినిమాల్లో ఛాన్స్ : విశాల్
- 7లో -

చేదు జ్ఞాపకాల నుంచి తేరుకుంటున్న కరుణాపురం

● కళ్లకురిచ్చి కల్తీసారా దుర్ఘటనకు యేడాది పూర్తి

(టి.నగర్, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపేసిన కళ్లకురిచ్చి కల్తీసారా ఘటనకు 69 మంది బలైన దుర్ఘటనకు నేటితో యేడాది పూర్తయ్యింది. గత యేడాది జూన్ 18 రాత్రి కళ్ళకురిచ్చి కరుణాపురం ప్రాంతంలో కల్తీసారా తాగి మృతి చెందిన సురేష్, ప్రవీణ్ అనే ఇద్దరు యువకుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్ళిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానికులు, కూలీలు ప్యాకెట్లలో అమ్ముతున్న కల్తీసారా తాగారు. మరుసటి రోజు ఉదయం ఆ సారా తాగినవారిలో కరుణాపురంలో ఒకే వీథికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పదిమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటనపై స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ శ్రవణ్‌కుమార్ చనిపోయిన ఐదుగురు కల్తీసారా తాగటం వల్ల ప్రాణాలు కోల్పోలేదన్నారు. కరుణాపురం వాసులకు కలెక్టర్ ప్రకటన కొండంత ధైర్యాన్ని తెచ్చిపెట్టింది. ఏడుగురి అంత్యక్రియలలో పాల్గొనేందుకు జనం అంతా కల్తీసారా తాగటానికి బారులు తీరారు. అప్పటికే ఏడుగురి మృతికి భయపడి ఇక మూటాముల్లె సర్దుకుని పారిపోదామనుకున్న కల్తీసారా వ్యాపారులు, కరుణాపురం వాసులంతా ఒకేసారి సారా కోసం రావటం చూసి అప్పటికప్పుడు వ్యాన్లలో సారా ప్యాకెట్లను తీసుకొచ్చి విక్రయించారు. కరుణాపురం వాసులు ఆ కల్తీసారాను తాగి ఇళ్లకు చేరుకున్నారు. గత యేడాది జూన్ 19న ఏడుకు పెరిగిన మృతుల సంఖ్య మరుసటి రోజు 39కి పెరిగింది. ఆ తర్వాత రెండు రోజులకు కల్తీసారాకు బలైనవారి సంఖ్య 69కి పెరిగింది. 160 మంది ఆసుపత్రుల్లో చికిత్సలందుకుని ప్రాణగండం నుండి తప్పించుకున్నారు గానీ కంటి చూపు కోల్పోయి, చర్మవ్యాధులు, కీళ్ళనొప్పులతో బాధపడుతూ ఆనాటి చేదు జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. అధికారుల లెక్కల ప్రకారం గత యేడాది జూన్ 18నుంచి 21 దాకా మెథనాల్ కలిపిన సారాను తాగిన 229 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటనకు సంబంధించి. కల్తీసారా అమ్మకం, కల్తీసారా అక్రమరవాణా సహా పలు నేరారోపణలపై 21మందిని అరెస్టు చేశారు. వారిలో ఒకరు మినహా మిగతావారందరూ బెయిలుపై విడుదలయ్యారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తలా రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించారు. ఆ సంఘటనపై సమగ్రమైన విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి పి.గోకులదాస్ నాయకత్వంలో ఏకసభ్య కమిటీని నియమించింది.



అప్పుడిని కోల్పోయి విలపిస్తున్న మహిళ (ఫైల్‌ఫొటో)

నల్ల బజారులో మద్యం..

ప్రస్తుతం కరుణాపురం వాసులంతా గత యేడాది జరిగిన దుర్ఘటనను తలచుకుని శోకతప్తులవుతున్నారు. గత యేడాది ఇదే సమయంలో కాయకష్టం చేసే కార్మికులు అధికంగా ఉన్న కరుణాపురం ఎటు చూసినా రోదనలు, వేదనలతో కన్నీటిసంద్రంలా మారింది, మూడు రోజుల వ్యవధిలో 69 మందిని కల్తీ సారా పొట్టన బెట్టుకుంది. ఇవన్నీ తలచుకుంటే గగుర్పాటు కలుగుతోందని కరుణాపురానికి చెందిన సత్య అనే యువతి తెలిపింది. 'ప్రస్తుతం మా ప్రాంతంలో కల్తీసారా అమ్మకాలు లేవు. చాలా ప్రశాంతంగా గడుపుతున్నాం. అయితే నల్లబజారులో రాత్రిపూట మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అధిక ధరలకు మద్యాన్ని మావాళ్లంతా తాగు తున్నారు. చిన్నప్పటి అలవాటు కాటికి వెళ్లేంతవరకు పోదు అనే తమిళ సామెతలా వేరే రూపంలో మద్యం, ధూమపానానికి మా ప్రాంతంలోని వారంతా బానిసలై పోయారు' అంటూ వాపోయింది.

గర్భంతో ఉన్నప్పుడే భర్తను కోల్పోయా...

కరుణాపురంలో చేతిబిడ్డను చంకన పట్టుకుని సంచరిస్తున్న రాధా అనే మహిళ మాట్లాడుతూ తాను రెండు నెలల గర్భంతో ఉన్నప్పుడే భర్త మణికంఠన్ కల్తీసారా తాగి మృతి చెందాడని, తండ్రి ముఖం చూడని ఆడపిల్లను ఆరుమాసాలుగా పెంచుతున్నానని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం కోసం అడిగినప్పుడు, మణికంఠన్‌కు తాను రెండో భార్య కావడంతో రూ.3లక్షలు మాత్రమే చేతికి అందాయని చెప్పారు. ప్రభుత్వం తనకు ఇంటి స్థలం కేటాయించాలని కోరింది.

కంటిచూపు కోల్పోయా..

గతేడాది కల్తీసారా తాగి కంటి చూపు కోల్పోయిన మాయకన్నన్ మాట్లాడుతూ మూటలు మోసే కార్మికుడిగా ఉన్న తనకు రోజువారీ సంపాదన చాలా తక్కువ అని, అదే సమయంలో తక్కువ ధరకు వస్తోంది కదా అని ఆ రోజు కల్తీసారాను తాగానని, దాని ఫలితంగా కంటిచూపును పోగొట్టుకుని యేడాది దాటిందన్నారు. తన కుమారుడు, కుమార్తె తనను కంటికి రెప్పలా కాపాడుతున్నారని, ప్రభుత్వం తరఫున రూ.50 వేలు మాత్రమే నష్టపరిహారం అందాయని చెప్పారు. కొడుకు డిగ్రీ పూర్తయి ఉద్యోగం కోసం వెదుకుతున్నాడని తెలిపారు. కుమార్తె ప్లస్-2 చదువుతోందని, భార్య సంపాదనపైనే పూర్తిగా ఆధారపడి జీవశ్చవంలా బ్రతుకుతున్నానని చెబుతూ కంట తడిపెట్టుకున్నాడు.



కంటి చూపు కోల్పోయిన అనిల్‌పాల్, మాయ కన్నన్, భర్తను పోగొట్టుకున్న రాధ

భార్య సంపాదనతో...

మణికంఠన్‌లాగే రాజస్థాన్ నుండి కళ్లకురిచ్చి ప్రాంతానికి వలస వచ్చి పెయింటింగ్ పనులు చేస్తున్న అనిల్‌పాల్‌కు కూడా కల్తీసారా తాగటం వల్ల కంటి చూపు పోయింది. భార్య టైలరింగ్ ద్వారా వచ్చే సంపాదనతో బ్రతుకు బండిని లాగిస్తున్నానని ఆయన తెలిపాడు. 'ప్రస్తుతం మేమంతా కల్తీసారాకు వ్యతిరేకులుగా మారం. అయినా ఏం ప్రయోజనం యేడాదికి ముందే మా కుటుంబాలను నట్టేట ముంచాం కదా!' అంటూ వాపోయాడు.



ఒకే చోట దహన క్రియలు జరుపుతున్న గ్రామస్తులు, అధికారులు (ఫైల్ ఫొటో)

ఇక కరుణాపురంలోనే కల్తీసారా వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన ఓ విద్యార్థిని మాట్లాడుతూ తల్లిదండ్రులు లేక తన ఇద్దరు తమ్ముళ్లను కాపాడుకుంటూ వస్తున్నానని, ప్రభుత్వం అందించిన పరిహారాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేశానని, తమ్ముళ్ల సంరక్షణకు ప్రభుత్వం ప్రతినెలా రూ.5వేలు అందిస్తోందని చెప్పారు. చదువుల కోసం ప్రతి విద్యా సంవత్సరానికి రూ.40వేలను ప్రభుత్వం పంపుతోందని తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన తమను ప్రభుత్వం సకాలంలో ఆదుకున్నదని, ప్రస్తుతం తామంతా బామ్మ సంరక్షణలో ఉన్నామని తెలిపారు.

ప్రభుత్వ చర్యలు...

కల్తీసారా దుర్ఘటన తర్వాత కళ్ళకురిచ్చి జిల్లా వైద్య కళాశాల ఆస్పత్రిలో మద్యం మాదక ద్రవ్యాల నిరోధక కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేంద్రంలో ప్రత్యేకంగా ఓ వైద్యుడిని కూడా నియమించారు. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ కళ్లకురిచ్చి జిల్లాలో కల్తీసారా, మాదక ద్రవ్యాలను నిరోధించే దిశగా గ్రామనిర్వహణాధికారి, నర్సు పంచాయితీ కార్యదర్శితో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే విధంగా కల్వరాయన్‌మలైలోను ప్రత్యేక నిఘా కమిటీని ఏర్పాటు చేసి, అక్కడ ల్తీసారా తయారీని పూర్తిగా నిరోధించ గలిగామని తెలిపారు. ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులు సమావేశమై ప్రజలకు మద్యం, మాదక ద్రవ్యాల నిరోధకంపై సలహాలు సూచనలు కూడా అందిస్తున్నామని చెప్పారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు శుభవార్త. వారికి ఇబ్బంది లేకుండా ఇక నుంచి వారిళ్లకే రేషన్ సరకులు పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ పథకంలో తొలివిడతగా 15 లక్షల మంది లబ్ధిపొందే అవకాశముందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలు లబ్ధిపొందేలా మార్కెట్ ధరకంటే తక్కువకు రేషన్ సరకులు పొందుతున్న విషయం తెలిసిందే. అయితే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు సరకుల కోసం వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొండప్రాంతాల్లో నివసిస్తున్నవారు రేషన్ సరుకుల కోసం 2 నుండి 3 కిలోమీర్ల దూరం వరకు నడిచివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో, తొలివిడతగా 70 ఏళ్ళు దాటిన సీనియర్ సిటిజన్లు, కుటుంబ సభ్యులు లేని దివ్యాంగులు సుమారు 15 లక్షల మందికి వారిళ్లకే వెళ్ళి రేషన్ సరుకులు పంపిణీ చేసే పథకానికి ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఈ విధానాన్ని ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే.

మురుగు శుభ్రం చేయండి

● అధికారులకు ప్రజల విజ్ఞప్తి

తిరుత్తణి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు బజారువీధిలోని రోడ్లపైకిచేరిన డ్రైనేజీ నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలిలా... పళ్లిపట్టు బజారువీధిలోని రోడ్లపక్కన అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాల కారణంగా కాలువలోకి మురుగునీరు వెళ్లే దారిలేకపోవడంతో డ్రైనేజీ నిండి రోడ్లపైకి నీరు చేరుతోంది. ముఖ్యంగా గాంధీ విగ్రహం వద్ద రోడ్లపై మురుగునీరు ఎక్కువగా నిలిచిపోతుంది. మురుగునీటి కారణంగా పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోందని, అధికారులు దీనిపై స్పందించి ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ కాలువను పునరుద్ధరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

కుమరి కలెక్టరేట్ వద్ద వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 70 యేళ్ల వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కన్నియాకుమారి సమీపం ఆరల్‌వాయ్‌మొళి ప్రాతానికి చెందిన తానమ్మాళ్ చేపల వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు వెళ్ళిన తానమ్మాళ్ వంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుళ్లు అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆమెను ప్రశ్నించగా కొందరు దుండగులు తనను చేపల వ్యాపారం చేయకూడదంటూ బెదరిస్తున్నారని, వారి బెదరింపుల నుండి కాపాడి తనను చేపలవ్యాపారం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆ తర్వాత పోలీసులు ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వంటిపై కిరోసిన్ పోసుకున్న తానమ్మాళ్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న మహిళా కానిస్టేబుల్

ఏనుగులను తరిమేందుకు గుంకీల రాక

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మకాం వేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఏనుగుల మందను అడవుల్లోకి తరిమేందుకు గుంకీ ఏనుగులను రప్పించారు. కూడలూరు సమీపం బదిర్‌కాడు ప్రాంతంలో మకాం వేసిన ఏనుగుల మంద, ఆహారం కోసం సమీపంలోని గ్రామాల్లో ప్రవేశించి ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రాణనష్టం జరుగకముందే ఏనుగులను అడవుల్లో తరమాలని ఆ ప్రాంతాల ప్రజలు అటవీ శాఖకు విజ్ఞప్తి చేశారు. దీంతో, ముదుమలై శరణాలయం నుంచి జంబో, కృష్ణ కుంగీ ఏనుగులను రప్పించిన అధికారులు, వాటి సాయంతో ఏనుగుల మందను అడవుల్లో తరిమే చర్యలు చేపట్టింది.

నగరంలో 59 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలతో చెన్నై జిల్లాలో 59 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల ప్రారంభం నుంచి సోమవారం వరకు సాధారణ వర్షపాతం 34.2 మి.మీ కాగా, 59 శాతం అదనంగా 54.2 శాతం వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పల్లావరం: ఈశ్వరీనగర్. శక్తినగర్, గణపతినగర్, సరోజిని నగర్, దర్గావీధి, పల్లావరం ఈస్ట్‌లో ఒక ప్రాంతం, నన్‌మంగళం, క్రోంపేట రోడ్డు, మురుగానందంనగర్, పల్లవగార్డెన్.

చిట్లపాక్కం : నూతనంజేరి, మేఘలానగర్, వేంగైవాసల్, భారతీ నగర్, బేతేలునగర్, రామకృష్ణన్‌నగర్, శర్మనగర్, చొక్కనాథర్‌వీధి, మానిక్యావాసగల్‌వీధి, రామకృష్ణాపురం, వాల్మికివీధి, ఈశ్వరినగర్, తంగల్‌కర్రి, వేళచ్చేరి రోడ్డు, శ్రీరామ్ అపార్ట్‌మెంట్, వీజీఆర్‌రోడ్డు, కామరాజర్‌వీధి, కట్టబ్రహ్మన్‌వీధి, గాంధీరోడ్డు, భారతిరోడ్డు, రాజీవ్‌గాంధీరోడ్డు, జీఎస్టీ రోడ్డు, ఈస్ట్ తాంబరంలో ఒక ప్రాంతం.

రెడ్‌హిల్స్ : ఎంఏనగర్, తిలగర్‌వీధి, ఆశాతంబి వీధి, ఎంజీఆర్‌వీధి, ముత్తుమారియమ్మన్‌కోవిల్‌వీధి, గాంధీనగర్, మాలమరమ్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ బోర్డు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

టాస్మాక్ వ్యవహారంలో ఈడీకి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ అవినీతి కేసులో సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్, వ్యాపారవేత్త విక్రమ్ రవీంద్రన్ ప్రమేయం నిరూపించే పత్రాలను బుధవారం దాఖలుచేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు మద్రాసు హైకోర్టు నోటీసులు జారీచేసింది. టాస్మాక్ అవినీతి కేసులో ఆకాష్ భాస్కరన్, విక్రమ్ రవీంద్రన్‌లకు చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. వీరిలో విక్రమ్ రవీంద్రన్ ఇల్లు, కార్యాలయాలకు సీలు వేశారు. ఈడీ చర్యలు వ్యతిరేకిస్తూ ఆకాష్ భాస్కరన్, విక్రమ్ రవీంద్రన్‌లు మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు.

'భవన నిర్మాణ కార్మికుల' పరిహారం పెంపు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఇచ్చే పరిహారం రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పలు రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారు మృతిచెందితే వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందజేస్తోంది. కార్మికుడు తాను పనిచేస్తున్న ప్రాంతంలో, ఆ పనులకు సంబంధించి మరేదైనా పని చేస్తున్న సమయంలో మృతి చెందితే వారి కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందజేస్తోంది. ప్రస్తుతం ఈ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ 24న సీపీఐ (ఎంఎల్) ధర్నా

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయెల్ అమానుష దాడులను ఖండిస్తూ సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో ఈనెల 24న ధర్నా చేపట్టనున్నారు. స్థానిక సైదాపేటలోని సాయంత్రం 4 గంటలకు జరిగే ధర్నాలో ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు పాల్గొనాలని సీపీఐ (ఎంఎల్) ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఉప వైద్యకోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉప వైద్య కోర్సుల అడ్మిషన్లకు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని వైద్య విద్య డైరెక్టరేట్ తెలియజేసింది. బి.ఫార్మ్, బీపీటీ, బీఎస్సీ (నర్సింగ్) బీఎస్సీ రేడియోథెరపీ సహా పలు రకాల ఉప వైద్య కోర్సులకు tnmedicalselection.org, https://re-g25.tnmedicalonline.co.in/pmc25 అనే వెబ్‌సైట్‌లలో జూలై 7వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

బస్సు పైకెక్కి రగడ... విద్యార్థులపై కేసు నమోదు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) బస్సు పైకెక్కి రగడకు పాల్పడిన కళాశాల విద్యార్థులపై పోలీసులు కేసు నమోదుచేశారు. సోమవారం బ్రాడ్‌వే వైపు వెళ్తున్న ఎంటీసీ బస్సు వ్యాసర్పాడి ఫ్లై ఓవర్‌పై వస్తుండగా కొందరు విద్యార్థులు బస్సు పైకెక్కి సెల్ఫీ తీసుకుంటూ ప్రయాణికులు, వాహనచోదకులను భయభ్రాంతులను చేశారు. దీనిపై బస్సు డ్రైవర్ ఫిర్యాదుతో ప్రజా ఆస్తులకు భంగం కలిగించడం, ప్రజలను ఇబ్బంది పెట్టడం సహా మూడు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి, వీడియో ఆధారంగా విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

హత్య కేసులో 9 మందికి యావజ్జీవ ఖైదు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూత్తంకుళిలో రీగన్ అనే వ్యక్తి హత్య కేసులో 9 మందికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. 2008లో రీగన్‌పై కత్తులతో దాడిచేసి, బాంబు వేసి హతమార్చారు. ఈ కేసులో 9 మందికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ తిరునల్వేలి అదనపు సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది.

మద్యం బార్లో దాడి - ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని మద్యం బార్లో ఇద్దరిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి గుట్కా, ఆటో, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కోయంబేడుకు చెందిన కాళిరాజన్ ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొంది విల్లివాక్కం తాళంకినరు ప్రాంతంలో బార్ నడుపుతున్నారు. ఇందులో కాంత్ మాలిక్, వేల్‌మణి పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించేందుకు బార్‌కు వెళ్ళిన ముగ్గురు వ్యక్తులు కాంత్ మాలిక్, వేల్‌మణితో వాగ్వాదానికి దిగి అసభ్యపదజాలంతో దూషించి బీరు బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా బార్‌లోని ఫర్నిచర్ ధ్వంసం చేసి ఆటోలో పరారైయ్యారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విల్లివాక్కం పోలీసులు రాజుశ్యామ్ (19, రాజేష్ (19), సూర్య (20)అనే వారిని అరెస్టు చేశారు. వారి నుండి 570 గ్రాముల గుట్కా, ఆటో, తదితరాలను స్వాధీనం చేసుకుని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బడికి వెళ్లడం ఇష్టం లేక.....

● విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల వయస్సు ఇద్దరు బాలికలు 10, 9వ తరగతి చదువుతున్నారు. వారికి బడికి వెళ్లేందుకు ఇష్టం లేకపోగా, తల్లిదండ్రుల బలవంతంతో పాఠశాలకు వెళ్తున్నట్లు సమాచారం. సోమవారం ఇంటి నుంచి పాఠశాలకు బయల్దేరిన ఇద్దరు బాలికలు, మార్గమధ్యంలో విషం కొనుగోలు చేసి, నీళ్లలో కలుసుకుని తాగారు. అనంతరం తరగతి గదికి వచ్చిన వారు స్పృహతప్పి పడిపోయారు. దిగ్భ్రాంతి చెందిన సహచర విద్యార్థులు వెంటనే ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేశారు. బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులు, వారిని అంబులెన్స్ ద్వారా విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

టాస్మాక్ ప్రారంభానికి నిబంధనలు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కొత్త టాస్మాక్ దుకాణాలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఆ ప్రకారం, టాస్మాక్ దుకాణం ప్రారంభించేందుకు ఆ ప్రాంతంలోని విద్యా సంస్థలు అభ్యంతరం తెలిపితే వాటిని పరిశీలించాలి. కొత్త దుకాణాల ప్రారంభానికి సంబంధించిన నిబంధనలు సవరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా పల్లడంలో కంటైనర్ లారీ కింద పడి అక్కా, చెల్లెలు మృతిచెందారు. పల్లడం మున్సిపల్ కార్యాలయం సమీపంలో నాలుగు రోడ్ల కూడలి ఉంది. మంగళవారం మధ్యాహ్నం కోవై వైపు వెళ్తున్న కంటైనర్ లారీ కూడలి వద్దకు రాగా సిగ్నల్ వేసి ఉండడంతో ఆగింది. సిగ్నల్ వేసిన వెంటనే డ్రైవర్ వేగంగా కంటైనర్ లారీని తిప్పే సమయంలో పక్కకు ఒరిగింది. ఆ సమయంలో తిరుప్పూర్ మహాలక్ష్మి నగర్‌కు చెందిన మహారాణి (55), చెల్లెలు కృతిక (35) వస్తున్న ద్విచక్రవాహనంపై కంటైనర్ లారీ పడింది. ఈ ఘటనలో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కేసు నమోదుచేసిన పల్లడం పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. కాగా, ప్రమాదానికి సంబంధించిన సీసీ ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



మృతులు మహారాణి, కృతిక (ఫైల్‌ఫొటో)

చోరీకెళ్లిన ఆలయంలో నిద్రపోయిన దొంగ

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి చోరీకి వెళ్లిన ఓ దొంగ మద్యంమత్తులో ఆ ఆలయంలోనే నిద్రపోయి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే కోయంబత్తూరు పుదూర్ ప్రాంతంలో బాల వినాయక, అయ్యప్పస్వామి ఆలయం ఉంది. ఆదివారం రాత్రి పూజలు ముగించిన పూజారి ఆలయానికి తాళం వేసి కెళ్లాడు. మరుసటిరోజు ఉదయం ఆలయానికి వెళ్లిన ఆ పూజారి ఆలయ తలుపులు తెరిచివుండటం చూసి అవాక్కైయ్యాడు. అనంతరం గర్భగుడి ముందున్న హుండీని బద్దలుకొట్టి ఉండటం చూసి ఆలయ నిర్వాహకులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆలయ నిర్వాహకులు, స్థానిక భక్తులు ఆలయంలో గాఢ నిద్రలోవున్న ఓ యువకుడిని లేపారు. అతడిని ప్రశ్నించగా, తన పేరు చిన్నయ్యన్ అని, ఆలయంలో దొంగతనానికి వచ్చానని, మద్యం మత్తులో ఇక్కడే నిద్రపోయినట్లు తెలిపాడు. దీంతో అతడిని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. దొంగను అరెస్టు చేసిన పోలీసులు హుండీలో దోచుకున్న రూ.8,250 నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

సమాచార దృష్టి

29న తిమ్మన పారిజాతాపహరణంపై వ్యాఖ్యానం

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 162వ ప్రసంగ కార్యక్రమం జరుగనుంది. అన్నమాచార్య వాఙ్మయ పరిశోధకులు గంధం బసవ శంకర రావు 'తిమ్మన పారిజాతాపహరణం' మానసోల్లాస వ్యాఖ్యానం చేయనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో జరుగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

ఎగ్మూరు-తిరునల్వేలి మధ్య ప్రత్యేక రైళ్లు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎగ్మూరు-తిరునల్వేలి మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. వివరాలిలా వున్నాయి... ఈ నెల 21వ తేదీ రాత్రి 9.55 గంటలకు ఎగ్మూరులో బయలుదేరే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (06089) మరునాడు ఉదయం 8.45 గంటలకు తిరునల్వేలి చేరుకోనుంది. అదేవిధంగా ఈ నెల 22వ తేదీ రాత్రి 9.40 గంటలకు తిరునల్వేలిలో బయలుదేరే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (06090) మరునాడు 8.15 గంటలకు ఎగ్మూరు చేరుకోనుంది. ఈ రైళ్లకు 2 ఏసీ టూ టయర్ బోగీలు, 2 ఏసీ త్రీటయర్ బోగీలు, 17 స్లీపర్ కోగీలు, 2 లగేజీలు వుంటాయి.

తిరువళ్లూరు, గుమ్మిడిపూండి మార్గాల్లో విద్యుత్ రైళ్లు : దక్షిణ రైల్వే వెల్లడి

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై-తిరువళ్లూరు, చెన్నై-గుమ్మిడిపూండి మార్గంలో 12 బోగీలతో విద్యుత్ సబర్బన్ విద్యుత్ రైళ్ల సేవలను దక్షిణ రైల్వే సోమవారం ప్రారంభించింది. ఈ రెండు రైలు మార్గాల్లో నడుపుతున్న 42 విద్యుత్ రైళ్లలో ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో వెళుతున్నారు. దీంతో రద్దీ నియంత్రించేలా ఈ రెండు మార్గాల్లో 12 బోగీలతో కూడిన విద్యుత్ రైళ్ల సేవలను ప్రారంభించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తంచేశారు.

మూడేళ్ల లా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరుంగుడిలోని డా.అంబేద్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల లా కోర్సుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.tndalu.ac. in అనే వెబ్‌సైట్‌లో జూలై 10వ తేది సాయంత్రం 5.45 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఐఐటీలో ఉద్యోగ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మద్రాసు ఐఐటీ, ప్రవర్తక్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలకు ఏఐ లెర్నింగ్ (ఎంఎల్ఓపీఎస్) పేరుతో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సు అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://www.tcsion.com /hub/iitmpravartak/scalablemachinelearningmodelsoperationsassociate/ అనే వెబ్‌సైట్ లో జూలై 5వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

తపాలశాఖలో ఉద్యోగావకాశాలు

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూరు ప్రాంతంలోని పోస్టాఫీసులో పోస్టల్ ఇన్స్యూరెన్స్ పథకాన్ని విక్రయించేందుకు ఏజెంట్లకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 11 నుండి అంబత్తూరు ప్రాంతంలోని హెడ్ పోస్టాఫీసులో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ జరుగుతుంది. పదో తరగతి, పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులై 18ఏళ్ల నిండినవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డులతో ఈ ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చు. అయితే ఇంటర్వ్యూలో ఎంపికైనవారు కేంద్రప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించబడరని అంబత్తూరు పోస్టల్ అధికారులు తెలిపారు.

ఈ- ఆటోల కొనుగోలుకు మహిళలకు రూ.3 లక్షల రుణం

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆటోలు కొనుగోలు చేసేందుకు మహిళలకు రూ.3 లక్షల రుణ సహాయ పథకం రాష్ట్రప్రభుత్వ సహకార బ్యాంకుల్లో ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాల్లో కేంద్రసహకార బ్యాంకు 933 శాఖలున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వాహన రుణ విభాగంలో ప్రభుత్వ ఉద్యోగులకు బైక్, కారు కొనుగోలు పథకం గత సంవత్సరం ప్రారంభమైంది. ప్రస్తుతం మహిళల ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచాలన్న ఉద్దేశంతో విద్యుత్ ఆటో కొనుగోలుకు రూ.3 లక్షల రుణ పథకం ప్రారంభమైంది.ఈ ఆర్థిక సంవత్సరంలో వెయ్యి మంది మహిళలు ఈ పథకంలో లబ్ధిపొందనున్నారు.

కుట్రాలంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో కుట్రాలం జలపాతంలో పర్యాటకుల స్నానాలకు అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది. తెన్‌కాశి జిల్లాలో వర్షాల కారణంగా కుట్రాలంలోని ఐదు జలపాతాల వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా ఆదివారం, సోమవారం జలపాతాల వద్ద స్నానాలకు నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో, జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టి, జలపాతాల వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో, మంగళవారం నుంచి పర్యాటకుల స్నానాలకు అనుమతించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఢిల్లీలో 1.41 ఎకరాలు లీజుకు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల కార్యాలయాల కోసం ఢిల్లీలో 1.41 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం లీజుకు తీసుకుంది. ఢిల్లీ చాణక్యపురిలో 1.75 ఎకరాలు, దికేంద్రజిత్ మార్గ్‌లో 1.96 ఎకరాల్లో తమిళనాడు అతిథి గృహాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ హోం శాఖ, ప్రజా పనుల శాఖ సహ వివిధ విభాగాల కార్యాలయాలు ఇక్కడ పనిచేస్తున్నా యి. ఈ ప్రాంతంలోని 'వైగై' నిలయాన్ని రూ.257 కోట్లతో పునర్నిస్తున్నారు. అందుకోసం ఈ భవనంలో పనిచేస్తున్న కార్యాలయాలను తాత్కాలికంగా బికాజీగామాలోని ఎంటీఎన్ఎల్‌కు చెందిన భవనానికి మార్చారు.

ప్రభుత్వాసుత్రుల్లో వ్యాక్సిన్ల కొరత

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులలో హెపటైటిస్-బి వాక్సిన్ కొరత ఏర్పడిన కారణంగా పసికందులకు ఇంజక్షన్ వేయలేని పరిస్థితి నెలకొంది. పచ్చ కామెర్ల బారిన పడకుండా అడ్డుకునేందుకు పసికందులకు పుట్టిన వెంటనే ఒక డోసు, నెల తర్వాత రెండో డోస్, ఆరు నెలల తర్వాత మూడో డోస్ హెపటైటిస్-బి వేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ వాక్సిన్ తయారీని సంబంధిత సంస్థలు హఠాత్తుగా నిలిపివేయడంతో గత ఐదు నెలలుగా ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా వ్యాక్సిన్ కొరత ఏర్పడింది. ఈ సమస్యను పరిశీలించి మళ్ళీ హెపటైటిస్-బి వాక్సిన్ తయారీపై దృష్టి సారించాలని రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు రాష్ట్రప్రజలు విజ్ఞప్తి చేశారు.

చిత్రజ్యోతి

శరవేగంగా నడిగర్ సంఘ
భవన నిర్మాణ పనులు

● వీడియో విడుదల

నడిగర్ సంఘం కొత్త భవన నిర్మాణ పనులు టీ.నగర్, హబీబుల్లా రోడ్డులో జరుగుతున్నాయి. బహుళ అంతస్తుల నిర్మాణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో తెలియజేస్తూ నడిగర్ సంఘం తాజాగా ఒక వీడియో రిలీజ్ చేసింది. ఈ భవన సముదాయంలో అతిపెద్ద ఆడిటోరియం, మీటింగ్ హాల్, మినీ కన్వెన్షన్ హాల్, డైనింగ్ హాల్, నడిగర్ సంఘ కార్యాలయం, అద్దెకు ఇవ్వనున్న ఫ్లోర్, పార్కింగ్ ఇలా అన్ని సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ వీడియో ఆఖరులో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్ మాట్లాడుతూ, 'ఒక పెద్ద కల. మేము తీసుకున్న కర్తవ్యం. ఈ రోజు పురోగతిలో ఉంది. అది త్వరలోనే పూర్తికానుంది. కల నిజమవుతుంది. దక్షిణ భారత నటీనటుల సంఘం గర్వం ఆకాశంలో ఎగురబోతోంది' అని పేర్కొన్నారు.



నడిగర్ సంఘం కొత్త భవనం నమూనా

రికార్డు సృష్టించనున్న
'కూలీ' విదేశీ రైట్స్ ?

సూపర్‌స్టార్ రజనీకాంత్ - దర్శకుడు లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'కూలీ' చిత్రం విదేశీ రైట్స్ ధర సరికొత్త రికార్డు నెలకొల్పనుంది. ప్రస్తుతం విదేశీ పంపిణీ హక్కుల బిజినెస్ ప్రారంభమైంది. ఈ రైట్స్ సొంతం చేసుకునేందుకు ప్రముఖ సంస్థ ఏకంగా రూ.70 నుంచి రూ.80 కోట్ల మేర చెల్లించేందుకు ముందుకొచ్చింది. అయినప్పటికీ చిత్ర నిర్మాత కళానిధి మారన్ మరింత అధిక మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ ఫారిన్ రైట్స్ బిజినెస్ ఇంకా పూర్తికాలేదు. ఈ సినిమా హక్కులను రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్లకు విక్రయిస్తే మాత్రం.. తమిళ చిత్ర పరిశ్రమలో సరికొత్త మైలురాయిగా నిలుస్తుందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. సన్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం. రజనీకాంత్‌తో పాటు అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, అమీర్‌ఖాన్, శృతిహాసన్, సత్యరాజ్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించగా ఆగస్టు 14న విడుదలకానుంది.



రజనీకాంత్ - లోకేష్ కనకరాజ్



సభ్యత్వ కార్డు ఉంటేనే సినిమాల్లో ఛాన్స్ : విశాల్

ఇకపై సభ్యత్వ నమోదు కార్డు లేకుండా సినిమాల్లో నటించడానికి వీల్లేదని, మెంబర్‌షిప్ కార్డు ఉన్నవారికి మాత్రమే సినీ అవకాశాలు ఇస్తామని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ స్పష్టం చేశారు. తమిళ సినీ నిర్మాతల సంఘం త్వరలోనే సినీ నిర్మాణ పనుల కోసం కొత్త అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకోనున్న నేపథ్యంలో విశాల్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'తమిళ చిత్రపరిశ్రమలో అన్ని శాఖల్లో సభ్యత్వం ఉన్న సభ్యులకు మాత్రమే ఉపాధి అవకాశాలు కల్పించినట్టుగానే నడిగర్ సంఘంలో కూడా సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే సినిమాల్లో నటించేందుకు తొలి అకాశం కల్పించాలి. భవిష్యత్‌లో కెమెరా ముందు నిలబడి నటించే వారు, జూనియర్ ఆర్టిస్టులు ఇలా ప్రతి ఒక్కరికీ నడిగర్ సంఘం సభ్యత్వ కార్డు ఉండాలని స్పష్టం చేశారు. నడిగర్ సంఘంలో జీవితకాల సభ్యత్వం (లైఫ్ టైమ్ మెంబర్‌షిప్) కోసం చెల్లించే రుసుము సంఘ సభ్యత్వం కలిగిన నిరుపేద కళాకారులకు వైద్యం, విద్య, ఇతర సహాయాలు, అంత్యక్రియల కోసం ఖర్చు చేస్తాం. నడిగర్ సంఘం నిబంధనలు, నియమావళి, ప్రయోజనాలపై ఇప్పటివరకు అవగాహన లేని వారు అన్ని విషయాలు తెలుసుకుని, ఈ నెల 20వ తేదీలోగా మెంబర్‌షిప్ కార్డు తీసుకోవాలని కోరారు.



పూజా హెగ్డే పాత్ర
షూటింగ్ పూర్తి

అగ్రహీరో విజయ్ - హెచ్.వినోద్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'జన నాయగన్'. పూజా హెగ్డే హీరోయిన్‌గా బాబి డియోల్, మమితా బైజు, ప్రియమణి తదితరులు నటిస్తున్నారు. బెంగుళూరుకు చెందిన కేవీఎన్ ప్రొడక్షన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుంది. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫుల్ లెంగ్త్ యాక్షన్ మూవీ. ఈ చిత్రం చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ మూవీలో తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను హీరోయిన్ పూజా హెగ్డే పూర్తి చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాఖాతాలో వెల్లడించారు. కాగా, ఈ చిత్రం టీజర్‌ను విజయ్ బర్త్‌డే సందర్భంగా రిలీజ్ చేయనున్నారు.



అభిమానులతో సెల్ఫీ తీసుకుంటున్న హన్సిక

ఫీనిక్స్ మాల్‌లో నటి హన్సిక సందడి

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి హన్సిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మాల్‌లో సందడి చేశారు. చెన్నై ఫ్యాషన్, జీవనశైలి, షాపింగ్ ఆఫర్ల మూడు నెలల వేడుక అయిన ఫీనిక్స్ షాపింగ్ ఫెస్టివల్‌ను లాంఛనంగా ప్రారంభించిన ఆమె అభిమానులతో కలిసి సందడి చేశారు. ఈ ఉత్సవం కొనుగోలుదారులకు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తోంది. వీటిలో బాస్, తుమి, హంకే మొల్లర్, లైఫ్ స్టయిల్, అవంత్రా తదితర ప్రముఖ బ్రాండ్లపై 50 శాతం వరకు రాయితీ కూడా కల్పిస్తున్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు జరిగే ఈ ఉత్సవం కొనసాగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

రామేశ్వరంలో స్థానికులకు
దర్శనభాగ్యం లేదా?

● ఆలయ ముట్టడికి భక్తుల యత్నం

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ఆలయం వద్ద మంగళవారం ఉదయం స్థానికులు, వివిధరాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు ఆలయ ముట్టడికి దిగారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామేశ్వరం రామనాథస్వామి ఆలయానికి రోజూ దేశం నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో స్థానికులు ఆ ఆలయంలో సులువుగా దైవదర్శనం చేయలేకపోతున్నారు. ఈ కారణంగా కొన్ని దశాబ్దాలకు పూర్వమే రామేశ్వరం ఆలయంలో స్థానికులకు ప్రాధాన్యం కల్పించే వారి కోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఉండేది. ఆ క్యూలైన్‌లో వెళ్ళి స్థానికులు సులువుగా దర్శనం చేసుకునేవారు. ఈ నేపథ్యంలో ఆ ఆలయానికి డిప్యూటీ కమిషనర్ చెల్లదురై బాధ్యతలు చేపట్టినప్పటి నుండి స్థానికుల క్యూలైన్ తొలగించారు. స్థానికులు ధర్మదర్శనం (సర్వదర్శనం) క్యూలైన్‌లోనే రావాలని ఉత్తర్వు జారీ చేశారు. దీంతో ఆలయ నిర్వాహకులపై స్థానికులు, రాజకీయ పార్టీల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఇటీవల రాజీ చర్చలు కూడా జరిగాయి. కానీ ఆలయ అధికారులు గతంలా ప్రత్యేక క్యూలైన్‌లో స్థానికులను అనుమతించే ప్రసక్తే లేదంటూ ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఖండిస్తూ మంగళవారం ఉదయం రామేశ్వరం నగరంలోని ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ విషయం ముందుగానే తెలుసుకున్న పోలీసులు ఆలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో వేల సంఖ్యలో స్థానికులు ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం వైపు దూసుకొచ్చారు. ఆ సందర్భంగా పోలీసులకు, స్థానికులకు మధ్య తొక్కిసలాట జరిగింది. అదే సమయంలో స్థానికులు పోలీసులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ప్రదర్శన కారణంగా ఆలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.



రామేశ్వరం ఆలయం వద్ద దూసుకొస్తున్న స్థానికులను కట్టడి చేస్తున్న పోలీసులు



పల్లకీలో వేంచేసిన నవనీత కృష్ణుడిని దర్శిస్తున్న భక్తులు

తంజావూరు నవనీత ఉత్సవాల్లో
16 పెరుమాళ్ళు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తంజావూరు హిందూ దేవాదాయ శాఖ, తంజావూరు రాజమహల్ దేవస్థానం, శ్రీరామానుజ దర్శన సభ సంయుక్త ఆధ్వర్యంలో ఏకనవతి వత్సర (91వ వార్షిక) ఉత్సవాలు ఆళ్వార్ మంగళాశాసనాలతో ఈ నెల 15న ప్రారంభమయ్యాయి. ఆ వేడుకల్లో భాగంగా సోమవారం 21 పెరుమాళ్ గరుడసేవలు అట్టహాసంగా జరిగాయి. మంగళవారం ఉదయం 16 పెరుమాళ్ ఆలయాల్లోనూ 'వెన్నైతాళి పెరువిళా' పేరుతో నవనీత సేవ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో వెన్నాట్రంకరై నీలమేఘ పెరుమాళ్, నరసింహ పెరుమాళ్, మణికుండ్ర పెరుమాళ్, కల్యాణ వెంకటేశ పెరుమాళ్, మేల్ రాజవీధి నవనీత కృష్ణన్, విజయరామ సన్నిధి, ఎల్లయమ్మ వీధి జనర్ధాన పెరుమాళ్, కరందై యాదవ కన్నన్, కీళ్‌రాజవీధి వరదరాజ పెరుమాళ్, తెర్కు రాజవీధి కలియుగ వెంకటేశ పెరుమాళ్, పళ్ళియగ్రహారం కోదండరామ స్వామి పెరుమాళ్, మకరనోంబు చావిడి నవనీత కృష్ణసామి, ప్రసన్న వెంకటేశ పెరుమాళ్, మేల్ అలంగం రంగనాథ పెరుమాళ్, పడిత్తురై వెంకటేశ పెరుమాళ్, కోడై ప్రసన్న వెంకటేశ పెరుమాళ్ సహా 16 పెరుమాళ్ళు వెన్నముద్దపట్టుకుని ప్రత్యేక అలంకారంలో ఊరేగారు. కీళ్‌రాజవీధి, తెర్కువీధి, మేల్ వీధి, వడక్కువీధిలో 16 పెరుమాళ్ల ఊరేగిన తర్వాత భక్తులను అనుగ్రహించారు. భక్తులంతా 16 పెరుమాళ్ళకు దీపారాధన చేసి మొక్కుకున్నారు.

నంబునాయకి ఆలయంలో
సౌమ్య ప్రత్యేక పూజలు



నంబునాయకి దర్శనం తర్వాత కుంకుమ ప్రసాదం స్వీకరిస్తున్న సౌమ్య, ఆమె కుమార్తెలు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాట్టాలిమక్కల్ కట్చి (పీఎంకే) అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి సతీమణి సౌమ్యా అన్బుమణి, ఇద్దరు కుమార్తెలతో కలిసి రామేశ్వరంలో తీర్థయాత్ర చేస్తున్నారు. నంబునాయకి అమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పీఎంకేలో ఆధిపత్యం కోసం ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆయన తనయుడు డాక్టర్ అన్బుమణి నడుమ ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్న నేపథ్యంలో సౌమ్య రామేశ్వరంలో పర్యటించారు. రామేశ్వరం నుండి ధనుష్కోడి వెళ్లే మార్గంలో ఉన్న నంబునాయకి అమ్మవారి ఆలయానికి సౌమ్య, ఆమె కుమార్తెలు సంఘమిత్ర, సంజుమిత్రతత కలిసి వెళ్ళారు. ఆ ఆలయం వద్ద సౌమ్య కుమార్తెలు మిరపరాయిపై పసుపు కొమ్ములు నూరి, ఆ పసుపు ముద్దను గర్భాలయంలోని అమ్మవారి పాదాలకు రాశారు. ఆ సందర్భంగా మామిడిపండ్లు, పూలు, పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. సౌమ్య, ఆమె కుమార్తెలు దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు.

శిల్పకళా నైపుణ్యంతో ఆకట్టుకుంటున్న రసూల్



శిల్పకారుడు రసూల్

తిరుత్తణి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు తిరుత్తణిలో నివాసం ఉంటున్న రెహ్మతుల్లా కుమారుడు రసూల్ శిల్పకళలో తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. హిందూ దేవాలయాలకు దేవతామూర్తుల విగ్రహాలు తయారుచేయడంలో ప్రావీణ్యం కలిగిన రసూల్ హిందూ మతంపై మక్కువ పెంచుకున్నాడు. అందుకే తనపేరును రసూల్ నుంచి బాబుగా మార్చుకుని ఆ కళనే తన వృత్తి గా మలుచుకున్నాడు. చిన్నప్పటినుండి ఆ వీధిలో నివాసముంటున్న ఓ విశ్వ బ్రాహ్మణ కుటుంబం వద్ద శిల్పకళ నేర్చుకున్న రసూల్ (బాబు)రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు కూడా దేవతామూర్తుల విగ్రహాలు తయారుచేసి, పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. ప్రస్తుతం ఇతను విశ్వ హిందూ పరిషత్ సంస్థలో పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

కానూర్ డ్యాం పనుల పరిశీలన



డ్యాం పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

ప్యారీస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా త్రిభువనంలో రూ.40.27 కోట్లతో నిర్మిస్తున్న కానూర్ డ్యాంను డిప్యూటీ సీఎం ఉదయనిధి పరిశీలించారు. త్రిభువనం సమీపంలోని వైగై నది నుండి విడుదల చేస్తున్న నీరు కానూర్ కాలువద్వారా ఆరు కల్వర్టులు, పళయనూర్ కాలువద్వారా 13 కల్వర్టులు మీదుగా ప్రవహిస్తుండటంతో సుమారు 7వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రస్తుతం ఈ సాగునీటి కాలువల్లో అధికస్థాయిలో నీరు నిల్వవుంచేలా వైగై డ్యాంపై ఆనకట్ట నిర్మించాలని స్థానిక రైతులు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విడుదల చేసిన రూ.40.27 కోట్లతో త్రిభువనం-పుదూర్ సమీపంలోని కానూర్ ప్రాంతంలో డ్యాం నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను మంగళవారం డిప్యూటీ సీఎం ఉదయనిధి, సహకారశాఖ మంత్రి పెరియకరుప్పన్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి ప్రదీప్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఆశా అజిత్, ఎమ్మెల్యే తమిళరసైతో కలిసి పరిశీలించి డ్యాం నిర్మాణం పనులను నిర్ణీత గడువులోపు పూర్తిచేయాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం అనంతరం తేని జిల్లా పెరియకుళం ప్రాంతంలోవున్న బీసీ సంక్షేమశాఖ వసతి గృహానికి వెళ్ళిన డిప్యూటీ సీఎం విద్యార్థులను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అందజేస్తున్న ఆహార వివరాలను పరిశీలించారు. ఆయనతో పాటు డీఎంకే ఎంపీ తంగతమిళ్ సెల్వన్, ఎమ్మెల్యేలు రామకృష్ణన్, మహారాజన్, శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ హాస్టల్‌లో కుక్‌తో మాట్లాడుతున్న ఉదయనిధి

గూడ్సురైలులో అగ్నిప్రమాదం

● ఓ బోగీలో నేలబొగ్గు దగ్ధం

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి హార్బర్ నుండి నేలబొగ్గు లోడుతో సోమవారం ఉదయం బయలుదేరిన గూడ్స్ రైలులో ఉన్నట్టుండి అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఆ రైలును కోవిల్‌పట్టి రైల్వేస్టేషన్‌లో నిలిపి అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి ఆ మంటలను ఆర్పివేశారు. తూత్తుకుడి హార్బర్ నుండి 59 బోగీల నేలబొగ్గుతో ఓ గూడ్సురైలు కరూరు జిల్లా పుగలూరు పేపర్ కర్మాగారానికి బయలుదేరింది. ఆ రైలు మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఆ గూడ్సురైలు కడంబూరు - కోవిల్‌పట్టి మధ్య వెళ్తుండగా ఓ బోగీలో ఉన్న నేల బొగ్గుకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న రైల్వే ఉద్యోగి వేలుసామి బోగీలోని నేలబొగ్గు మండుతుండటం గమనించి ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. వెంటనే ఆ రైలును కోవిల్‌పట్టి రైల్వేస్టేషన్ వద్ద నిలిపేశారు. రైల్వే సిబ్బంది ఆ గూడ్సురైలులోని 17వ నెంబర్ బోగీ నుంచి మంటలు రావటం గమనించి అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక దళం ఫైరింజన్ అక్కడికి చేరుకుని గంటసేపు పోరాడి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ సంఘటన కారణంగా కోవిల్‌పట్టి మీదుగా వెళ్లే తిరుచ్చి - తిరువనంతపురం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నల్లి రైల్వేస్టేషన్ వద్ద, చెన్నై - నాగర్‌కోవిల్ వందే భారత్ విరుదునగర్ రైల్వేస్టేషన్ వద్ద నిలిపివేశారు. గంట తరువాత ఆ మార్గంలో రైళ్లరాకపోకలను పునరుద్ధరించారు.



ఓ బోగీలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం



ఓ తమిళ చానెల్‌లో 'తమిళంలో ఆటాడుకుందాం' శీర్షికన నిర్వహించిన పోటీలో విజేతలుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న దృశ్యం.

అసెంబ్లీ ఎన్నికల్లో గతం కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం

మంత్రి కేఎన్ నెహ్రూ ధీమా

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి గెలిచిన సీట్ల కంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందని మంత్రి కేఎన్ నెహ్రూ ధీమా వ్యక్తం చేశారు. తిరునల్వేలిలో 14 మార్గాల్లో 14 మినీ బస్సులను మంత్రులు కేఎన్ నెహ్రూ, అనితా రాధాకృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. అసెంబ్లీ స్పీకర్ అప్పావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం అనంతరం మంత్రి నెహ్రూ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో తుపాకి సంస్కృతి పెరిగిందని ప్రతిపక్ష నేత పళనిస్వామి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో తూత్తుకుడిలో కాల్పులు ఎలా జరిగాయని రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో, తమ ఉనికి కాపాడుకొనేలా కొందరు నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించి, మళ్లీ ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపడతారని మంత్రి నెహ్రూ తెలిపారు.

పనసపండ్ల కోసం పరుగెత్తుకొస్తున్న ఏనుగులు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా అందియూరు, బర్గూరు ప్రాంతాల్లో ప్రస్తుతం పనసపండ్లు విపరీతంగా కాయడంతో వాటి కోసం ఏనుగులు బారులు తీరుతున్నాయి. అందియూరుకు చేరువగా ఉన్న అడవుల నుండి ఏనుగులు ఆహారం కోసం జనావాస ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. రహదారుల్లో చెరకు, పనసపండ్ల లోడు లారీలు వెళితే ఆ ఏనుగులు మూకుమ్మడిగా చుట్టుముట్టి వాటిని ఆరగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బర్గూరు సమీపం తురుచన్న పాళయం ప్రాంతంలోని పనసపండ్ల తోటలోకి ఒకేసారి ఐదు పెద్ద ఏనుగులు, మూడు గున్న ఏనుగులు చొరబడి పనసపండ్లను ఆరగించి తోటనంతా ధ్వంసం చేసి అడవిలోకి వెళ్ళాయి. ఈ విషయమై స్థానికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.



బర్గూరు వద్ద సంచరిస్తున్న ఏనుగులు



రెడ్ నెక్కుడు వాలాబీ (ఎర్ర మెడ గల వాలాబీ)





జూపార్కులో ఇక మరింత సందడి

● ఆగస్టులో విదేశీ వన్యప్రాణుల రాక


ఎస్వీ జూపార్కుకు మరికొన్ని వన్యప్రాణులు రానున్నాయి. సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. ముమ్మూర్తులా ఆస్ట్రేలియాలోని కంగారు జాతిని పోలి ఉండే రెండు రెడ్ నెక్డ్ వాలాబీ(ఎర్ర మెడ)లు, దక్షిణాఫ్రికాకు చెందిన రెండు మార్మోసెట్‌లు ఆగస్టులో వస్తాయని ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. ప్రస్తుతం ఈ అందాల వన్యప్రాణులు గుజరాత్ జూపార్క్‌లో ఉన్నాయి. వీటిని ఉంచేందుకు రూ.55లక్షల వ్యయంతో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేస్తున్నామని క్యూరేటర్ చెప్పారు. ఇందుకోసం టెండర్లు పిలుస్తున్నామన్నారు. వైట్ టైగర్స్ సఫారి పూర్తి కావచ్చిందన్నారు. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కాగా ఇక్కడి జూపార్కులో ఇప్పటికే 33 ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇందులో సింహాలు, బెంగాల్ టైగర్లు, ఏనుగులు, చిరుతలు, జాగ్వార్లు, నీటి ఏనుగులు, పక్షులు, అడవి దున్నలు, జింకలు, దుప్పులు, మొసళ్లు ఉన్నాయి. తిరుమలకు వచ్చే భక్తులే కాకుండా ఎస్వీ జూపార్కు సందర్శకులు సంఖ్య పెరుగుతోందని సెల్వం వివరించారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

శ్రీహరి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు విస్తరించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు
- సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,681
- తలనీలాలు సమర్పించినవారు: 35,261





బోర్డు మీటింగులో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు, ఈవో

సనాతన హిందూ ధర్మప్రచారం కోసం

ఏటా రూ.120 కోట్ల ఖర్చు

- చిత్తూరు జిల్లాలో 141 ఆలయాల నిర్మాణానికి ఆమోదం
- మానవీయ విలువలపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తిరుమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'సనాతన హిందూ ధర్మప్రచారం కోసం టీటీడీ ఏటా హెచ్‌డీపీపీ ద్వారా రూ.120 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల నూతన కార్యక్రమాలను ప్రారంభించేందుకు మా బోర్డు తీర్మానాలు చేసింది' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం హెచ్‌డీపీపీ విభాగంలోనూ బోర్డు సభ్యులు వివిధ అంశాలపై చర్చించారు. ఆ వివరాలను బోర్డు సభ్యులు నరేష్, పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, జానకీదేవి, శాంతారామ్, రామ్మూర్తి, సదాశివరావు, ఎక్స్‌అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డితో కలిసి బీఆర్ నాయుడు క్యాంపు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 141 నూతన ఆలయాల నిర్మాణానికి ఆర్థికసాయం కోసం ఆమోదం తెలిపామన్నారు. మిగిలిన ప్రాంతాలకు చెందిన వారూ ముందుకు వస్తే రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆలయ నిర్మాణాలకు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు కేటాయిస్తామన్నారు. దళితవాడల్లో ఆలయాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

మరికొన్ని నిర్ణయాలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని సమరసతా సేవా ఫౌండేషన్ ద్వారా తిరుపతిలోని టీటీడీ శ్వేతాకు తీసుకొచ్చి అర్చకత్వంపై శిక్షణ ఇవ్వాలని తీర్మానం. వారి ప్రాంతాల్లోని ఆలయాల్లో అర్చకత్వం చేసుకునేలా పూజా విధానాలు, వ్రతాలపై శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం.
- టీటీడీకి చెందిన ఏడు పాఠశాలల్లోని దాదాపు 1,600 మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో హైందవ సనాతన ధర్మం నేర్పిన మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వడానికి 'సద్గమయ' నిర్వహించేందుకు నిర్ణయం.
- సనాతన ధర్మం, తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడానికి 'మన వారసత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయం.
- వరలక్ష్మీ వ్రతం రోజు పద్మావతి అమ్మవారి ఆలయంలో 'సౌభాగ్యం' నిర్వహించేందుకు ఆమోదం.
- సీఎం ఆదేశాలతో టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో 21న యోగా డే నిర్వహించాలని తీర్మానం.
- ప్రకృతి పరిరక్షణకు భక్తులకు మొక్కలను అందజేసేలా 'వన-నిధి', భవిష్యత్తు తరాలకు హరికథ కళను అందించేలా 'హరికథావైభవం', యువత ద్వారా భజనలను ప్రోత్సహించేలా 'భజేశ్రీనివాసం', గిరిజన ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు 'గిరిజనార్థనం'తో పాటు అక్షరగోవిందం, భగవద్గీత అనుష్ఠాన బోధన వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం.
- న్యూఢిల్లీలో 1952లో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టీటీడీ కళాశాలను ఆధునికీకరించేందుకు ఆమోదం.
- అలిపిరి చెక్‌పాయింట్‌లోని ఆర్చిని ఆధ్యాత్మిక శోభతో కొత్తగా నిర్మించాలని తీర్మానం.

'ఎన్‌ఐసీ' పోటీ పరీక్షలు రద్దు

● మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య



మాధుర్ (ఫైల్ ఫొటో)

పుత్తూరు/పుత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌ఫార్మాటిక్స్ సెంటర్(ఎన్‌ఐసీ.. నిక్) సి- కేడర్ సైంటిస్ట్ పోస్టుల పోటీ పరీక్షను రద్దు చేయడంతో మనస్తాపానికి గురై పుత్తూరు పట్టణానికి చెందిన మాధుర్ (32) ఆత్మహత్య చేసుకున్నారు. నవీ ముంబైలోని ఎస్బీఐలో ఐటీ అధికారిగా పని చేస్తున్న ఈయన శనివారం ఉరేసుకున్నారు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేయగా, పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని పుత్తూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. 'తాను కలగన్న ఉద్యోగం దూరమైందని జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మా కొడుకుకు ఎదురైన ఇబ్బందులు మరొక్కరికి జరగకూడదు. ఎన్‌ఐసీ నోటిఫికేషన్ రద్దుపై పూర్తి స్థాయిలో జాతీయ దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరిపించాలి' అని రోదిస్తూ జార్జ్, హేమలత దంపతులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని యువతకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వయస్సు రీత్యా ఎన్‌ఐసీలో ఉద్యోగానికి చివరి అవకాశం కావడంతో ఎంతగానో తపన పడి చదివాడని అతడి చెల్లెలు హాసిక చెప్పారు.

సూసైడ్ నోట్‌లో ఏముందంటే..!

'నేను ఎంతో కష్టపడి, ఇష్టపడి నిక్ పోటీ పరీక్షలు రాశా. ఇంటర్వ్యూలో నెగ్గి 5వ ర్యాంకు సాధించా. అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాల్సిన నేపథ్యంలో ఏడాదిగా వాయిదా వేస్తూ చివరకు రద్దు చేయడం జీర్ణించుకోలేకపోయా. ఆలస్యంపై ప్రధాని, నిక్ కార్యాలయాలకు ఫిర్యాదు చేశా. చివరకు నాతో పాటూ ఎంపికైన అభ్యర్థులతో బాంబే హైకోర్టును ఆశ్రయించా. ఇలాంటి తరుణంలో ఆశావహుల ఆశల మీద నీళ్లు చల్లుతూ పరీక్షల నోటిఫికేషన్ మొత్తాన్ని నిక్ రద్దు చేసింది. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నా. పైపెచ్చు నాలాంటి యువకులకు న్యాయం కలగాలి. వ్యవస్థలలో కనువిప్పు కలగాలి. నా మరణంతో వచ్చిన డబ్బుతో మంచి పాఠశాలను పెట్టి ఆధారం లేని చురుకైన పిల్లలకు ఉచిత విద్య అందించు హాసిక(చెల్లెలు)' అంటూ మాధుర్ సూసైడ్ నోట్‌లో రాశారు.

అబ్దుల్ కలాంలా సైంటిస్టు కావాలని..

'అబ్దుల్ కలాంలా బ్రహ్మచారిగా ఉంటూ సైంటిస్టు కావాలని కలలు కనేవాడు. నిత్యం పోటీ పరీక్షలు రాస్తూ ఉన్నత లక్ష్యాలను పెట్టుకున్నాడు.శనివారం రాత్రి 10 గంటల వరకు ఫోనులో మాట్లాడాడు. ఆ మరుసటి రోజు నుంచి ఫోన్ పని చేయలేదు. ఆదివారం ఉదయం పనికి రావద్దని శనివారమే పని మనిషికి చెప్పాడంట'అంటూ మాధుర్ తల్లి హేమలత రోదిస్తూ చెప్పారు. పట్టుదలతో ఎంటెక్ సాధించి జాతీయ బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగసంస్థల్లో జనరల్ సీటుతో ఉద్యోగాలు సంపాదించాడని గుర్తుచేసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన ఎక్కువేనన్నారు. తన కుమారుడి ప్రవర్తన చూసి ముంబైలోని ఎస్బీఐ డీజీఎం స్థాయి అధికారులు దగ్గరుండి శవ పేటికను భద్రంగా చెన్నైకు విమానంలో తరలించారని తెలిపారు.

మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద

టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టండి

● యాజమాన్యానికి కలెక్టర్ వెంకటేశ్వర్ సూచన

రేణిగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమ వద్ద యజమానులు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. రేణిగుంట మండలం ఎస్ఎస్ పురంలోని శ్రీ వర్ష ఫుడ్ పరిశ్రమలో మామిడి పండ్ల గుజ్జు తయారీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి కాయలను తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. తోతాపూరి రకం మామిడి కాపు ముగిసే వరకు పల్ప్ ఫ్యాక్టరీలు కాయలను తీసుకుంటాయన్నారు. ప్రతి పరిశ్రమ వద్ద నియమించిన అధికారులు.. రైతులు తీసుకొచ్చే మామిడి కాయల టన్నులను నమోదు చేసుకుంటారన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అందించే సబ్సిడీని ఆయా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు రైతులు తీసుకొచ్చే మామిడి కాయల వివరాలను కంప్యూటరీకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఏడీ సురేంద్రబాబు, తహసీల్దారు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కేవీబీపురంలోని దేవరాజు అగ్రోఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు.



మామిడి గుజ్జు ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యానికి సూచనలు చేస్తున్న కలెక్టర్

తోతాపురి కొనుగోలుకు సహకరించండి: జేసీ

పాకాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్‌లో మంగళవారం జేసీ శుభం బన్సల్ పర్యటించారు. తోతాపురి మామిడికాయల కొనుగోళ్లను పరిశీలించారు. రైతులు, వ్యాపారులు, ర్యాంపుల యజమానులతో మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి మామిడి కాయల కొనుగోలుకు సహకరించాలని సూచించారు. టన్నుకు ప్రభుత్వం రూ.4వేలు సబ్సిడీ ఇసున్న క్రమంలో గుజ్జు పరిశ్రమలు రూ.8వేలకు కొనుగోలు చేయాలన్నారు. ర్యాంపుల వద్ద టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టి కొనాలని సూచించారు పరిశ్రమల్లో మామిడి కాయలు తీసుకోవడం లేదని, రవాణాకు తగినన్ని లారీలు లేవని ర్యాంపుల యజమానులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల రవాణా సంఘాలతో చర్చించి ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలు, ర్యాంపుల వద్దకు తీసుకొచ్చిన కాయలను సకాలంలో అన్‌లోడింగ్ చేయక పోవడంతో చాలాభాగం పాడయిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రావారిపాలెం,చిన్నగొట్టిగల్లులోని మామిడి కాయల మండీలు, ర్యాంపులను జేసీ పరిశీలించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్, మండల ఉద్యాన అధికారిణి శైలజ, డీటీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



దామలచెరువులో వ్యాపారులు, ర్యాంపుల యజమానులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్



రవి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు

చెరువులో వాహనం బోల్తా

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

భాకరాపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చెరువులో టాటా సుమో బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు చిన్నగొట్టిగల్లు మండలం మారసానివారిపల్లె హరిజనవాడకు చెందిన శంకర, ప్రకాశ్, భాకరాపేటకు చెందిన రఘునాథ్, తిరుపతికి చెందిన రవి, శంకరలు టాటా సుమోలో మంగళవారం భాకరాపేట నుంచి చిన్నగొట్టిగలు బయలుదేరారు. చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై గంగమ్మ ఆలయం మలుపులో టాటా సుమో అదుపు తప్పింది. చెరువులోకి దూసుకెళ్లింది. వెనుక వస్తున్న ఓ ద్విచక్ర వాహనచోదకుడు వెంటనే స్థానికులు, పోలీసులకు సమాచారం అందించాడు. స్థానికులు, పోలీసులు క్రేన్ సాయంతో వారిని నీటి నుంచి కాపాడారు. అప్పటికే రవి(40) మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రుయా ఆసుపత్రికి తరలించారు. రవి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అతని భార్య, బంధువులు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.



గాయపడిన శంకర, రఘునాథ్, ప్రకాశ్



చెరువులో నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

207 మందికి టీడీఆర్ బాండ్ల పంపిణీ

తిరుపతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 207 మందికి టీడీఆర్ బాండ్లను పంపిణీ చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని చెప్పారు. అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 207మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా మంగళవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు 187 మందిని ఎంపిక చేశామని చెప్పారు. వీరందరూ గిఫ్ట్‌డీడ్ ఇచ్చిన వెంటనే టీడీఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీసీపీ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ రవాణాశాఖలో అప్రెంటీస్ కోసం

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ రవాణాశాఖలో సంవత్సర కాలం అప్రెంటిస్‌గా చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ పాసైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు, 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్సు ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నెంబరు, ఈమెయిల్ ఐడీ, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను ఈ నెల 30వ తేదీ లోగా అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ సి.గంగాధరంకు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441647174 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో

4 వారాంతపు ప్రత్యేక రైళ్లు మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా- తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేకరైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

● లేదంటే సీజ్ చేస్తామంటున్న రవాణా అధికారులు

తిరుపతి(రవాణా), జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్నెస్‌పై రవాణాశాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ల కోసం హాజరయ్యే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం తిరుపతి ఆర్టీఏ కార్యాలయ పరిధిలో ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన బస్సులను డీటీసీ కృష్ణవేణి, డీటీవో మురళీమోహన్ పరిశీలించారు. డీటీవో వాహనాన్ని నడిపి కండిషన్‌ను పరిశీలించారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,700 బస్సులకుపైగా ఉండగా, ఇంకా 450కిపైగా ఎఫ్‌సీ (ఫిట్నెస్ సర్టిఫికెట్) తీసుకోలేదన్నారు. ఎఫ్‌సీల గడువు ముగిసిన వెంటనే బస్సులను యథావిధిగా కండిషన్‌లో పెట్టుకుంటేనే ఆ తర్వాత సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. ఫిట్నెస్‌తో పాటు ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగే బస్సులకు జరిమానా విధించడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందని బస్సులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రత్యేకించి బృందాలను ఏర్పాటు చేశామన్నారు.



ఫిట్నెస్ కోసం వచ్చిన వాహనాన్ని నడిపి చూస్తున్న డీటీవో మురళీమోహన్, పక్కన డీటీసీ కృష్ణవేణి, ఎంవీఐ శ్రీనివాసరావు

గురురాజుపల్లి ఎస్టీ కాలనీపై వైసీపీ నేత కన్ను!

● హైవే పక్కన ఇళ్ల స్థలాలను కొని ఖాళీ చేయించే పన్నాగం

రేణిగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గురురాజుపల్లి ఎస్టీ కాలనీపై ఓ వైసీపీ నేత కన్ను పడింది. హైవే పక్కనున్న ఆ కాలనీలోని ఎస్టీల స్థలాలను కొని.. ఖాళీ చేయించే పన్నాగంలో ఉండటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గురురాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సుమారు 80 కుటుంబాలున్నాయి. ఈ ఎస్టీ కాలనీకి 20 ఏళ్ల కిందట శ్రీ సత్య సాయి ట్రస్ట్ తరఫున ఇళ్లు, రోడ్లు నిర్మించి ఇచ్చారు. ఇటీవల ఆరు లేన్ల నేషనల్ హైవే రావడంతో కాలనీలోని సగం ఇళ్లు రోడ్డుకు పోయాయి. మిగిలిన కాలనీలో ఎస్టీలు రోడ్డు నష్టపరిహారంతో ఇళ్లు నిర్మించుకొని హైవే పక్కన జీవనం సాగిస్తున్నారు. హైవే పక్కనే ఉండటంతో ఈ కాలనీలోని స్థలాలకు మార్కెట్‌లో రూ.కోట్లలో విలువ ఉంది. దీంతో ఆ స్థలాన్ని సొంతం చేసుకునేలా ఓ వైసీపీ నేత స్కెచ్ వేశారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే మద్యం, డబ్బు ఎర చూపి 15 ఇళ్లను అతి తక్కువ ధరకు కొన్నారని సమాచారం. వీరందరినీ బలవంతంగా ఇటీవల ఖాళీ చేయించారన్న ఆరోపణలున్నాయి. దీంతో తమనూ బలవంతంగా ఖాళీ చేయిస్తారా అన్న ఆందోళన మిగిలిన ఎస్టీల్లో మొదలైంది. తమ కాలనీలో మిగిలిన ఇళ్లను ఆ వైసీపీ నేత బలవంతంగా కొనకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, రోడ్డు విస్తీర్ణానికి నష్టపోయిన ఎస్టీ కుటుంబాలకు గురువరాజు పల్లి సమీపంలోని డీకేటీ భూముల్లో మూడు సెంట్ల లెక్కన కేటాయించనున్నారు. దీంతో ఆ భూములు బాధితులకు కేటాయించక ముందే ఎస్టీ కాలనీవాసులకు అడ్వాన్సుల రూపంలో డబ్బులు చెల్లించి వాటిని దక్కించుకోవాలని చూస్తున్నారని సమాచారం. వీటిపై అధికారులు విచారణ జరపాల్సి ఉంది.



నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న ఎస్టీ కాలనీ